నవభూమి
నల్లగొండ
అనుబంధం
27 సెప్టెంబర్,2024 శుక్రవారం పేజీలు:5
www.epaper.navabhoomi.in



# నత్తనడకన వంతెనల పనులు



**రాజాపేట, –నవభూమి:** వానొచ్చేనంటే వరదొస్తాది... వరదొచ్చేనంటే భయమేస్తాది.. ఇది రాజాపేట మండలంలోని వాగులపైన కల్వర్టుల పరిస్థితి. మండలంలో బేగంపేట, పొట్టిమర్రి, దూదివెంకటాపురం, కుర్రారం, పారుపల్లి, రఘునాథ్‌పూర్ గ్రామాల్లో వాగులు ఉన్నాయి. రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వార్షాలకు బేగంపేట, పారుపల్లి వాగులపైన కాజ్‌వేలు పూర్తిగా వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. గత ఏడాది కురిసిన వర్షాలకు దూదివెంకటాపురం, కుర్రారం కల్వర్టు కింద వరద తాకిడికి మట్టి కొట్టుకుపోయి ఎప్పుడు కూలుతాయో అన్నట్టుగా మారాయి. మండలంలోని పొట్టిమర్రి వాగుపై గతంలో కాజ్‌వేను నిర్మించారు. ప్రతీ ఏడాది వరదలు రావడంతో యాదగిరిగుట్ట, రాజాపేట పట్టణాలకు రవాణా సౌకర్యం నిలిచిపోతోంది. తుర్కపల్లి, రాజాపేట మండల కేంద్రాలకు ఇదే పరిస్థితి. రాజాపేట మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా అధికారులు, నాయకులకు కాజ్‌వేలపై బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు మొరపెట్టుకుంటూనే ఉన్నారు.నిధులు మంజూరైనా..గత ఏడాది పొట్టిమర్రి, పారుపల్లి, బేగంపేట, వాగులపై ఉన్న కాజ్‌వేల స్థానంలో రోడ్డు ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగా, అప్పటి ఎమ్మెల్యే గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. బేగంపేట వాగుపై రూ. 9. 30కోట్లతో బ్రిడ్జి పనులు ప్రారంభించగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పొట్టిమర్రి, పారుపల్లి బ్రిడ్జిల నిర్మాణం ఊసేలేదు. కాగా రెండు రోజులుగా గంధమల్ల చెరువు మత్తడి పారుతుండంతో బేగంపేట వాగులో వేసిన తాత్కాలిక రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో సికింద్రాబాద్, తుర్కపల్లి పట్టణాల నుంచి రాజాపేట మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి. బేగంపేట గ్రామస్థులు మండలానికి రావాలంటే 5 కిలోమీటర్లు అదనంగా తిరిగి రావాల్సి వస్తోంది. మండలంలో దెబ్బతిన్న కల్వర్టు మరమ్మతులకు ఏడాదిగా నోచుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించాలని, దెబ్బతిన్న కల్వర్టులకు మరమ్మతు పనులను చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## గాంధీ జయంతి నుండి మిర్యాలగూడలో ప్లాస్టిక్

# కవర్స్ కనిపిస్తే కఠిన చర్యలు

**మిర్యాలగూడ సెప్టెంబర్ 26:–** మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గత కొద్ది రోజుల క్రితం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ప్రకటించిన నేను నా మిర్యాలగూడ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రకటించిన ప్లాస్టిక్ కవర్స్ నియంత్రణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్లాస్టిక్ కవర్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపేనీ యాజమాన్యం, ప్లాస్టిక్ కవర్స్ హెూల్ సేల్ రిటైల్ అమ్మకందారుల సమావేశం గురువారం రాత్రి నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్స్ పూర్తిగా నియంత్రించాలంటే మీ పాత్ర చాలా కీలకమన్నారు.హానికలిగించే కవర్స్ వాడకం తగ్గాలంటే వాటి అమ్మకం తగ్గించాలన్నారు. అలాగే వాటి స్థానంలో పర్యావరణానికి హాని కలగకుండా భూమిలో సులువుగా కరిగిపోయే కంపోస్టబుల్ కవర్లు తయారీ, అమ్మకాలు చేయడం వలన పూర్తిగా హాని కలిగించే ప్లాస్టిక్ కవర్స్ కి చెక్ పెట్టగలమని సూచించారు.అక్టోబర్ 2 గాంధీ జయంతి నుండి మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు ఎక్కడ జరిగినా వరిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.అక్టోబర్ 2 నుండి మిర్యాలగూడ నియోజకవర్గంలో కేవలం కంపోస్టబుల్ కవర్స్ మాత్రమే కనిపించాలన్నారు.హాని కలిగించే ప్లాస్టిక్ కవర్స్ ఏ వ్యాపారి అమ్మినా కొన్నా వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## సాయుధ పోరాట వీరనారి ఐలమ్మకు విప్లవ

# జోహార్లు



◆ **జోహార్లఆర్పించిన సిపిఎం నాయకులు**

**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 26:–**తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చిట్యాల ఐలమ్మ 130 వ జయంతి సభ స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేశం ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం లో నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ అండతో ఐలమ్మ తన భూమిని కాపాడుకోవడం కోసం నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం పిలుపుమేరకు ఎర్రజెండా చేతబట్టి పాలకుర్తి గ్రామంలో చుట్టుపక్కల ప్రజలను చైతన్యపరిచి నైజం అరాచకాలను, తిప్పికొట్టడానికి ధైర్యంతో ముందుకెళ్లిన ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. , ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, సామాజికవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఐలమ్మ స్ఫూర్తితో ప్రజలను ఏకం చేసి పోరాటం చేయడమే, ఐలమ్మకు ఘన నివాళి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, 6 గ్యారంటీలను అమలు చేయాలని, వృత్తిదారులకు సంక్షేమ పథకాల ద్వారా వ్యక్తిగత రుణాలు ప్రతి ఒక్కరికి 10 లక్షలు ఇవ్వాలని , అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు,రిటైర్డ్ సంఘం జిల్లా అధ్యక్షులు నూకల జగదీష్ చంద్ర, జిల్లా కమిటీ సభ్యులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమడాల పరుశురాములు, వినోద్ నాయక్, సీనియర్ నాయకులు, పగిడోజు రామూర్తి, నాయకులు నాగేంద్రప్రసాద్, ఉన్న%శీ% వెంకటేశ్వర్లు, కోటిరెడ్డి, కోడిరెక్క మల్లయ్య, పాదురి గోవర్ధన, నాగేశ్వర్రావు, చౌగాని వెంకన్న, నాగరాజు, రామారావు పాల్గొన్నారు.



# సర్వేతో సర్వత్రా ఆనందం

# 27న హలో విద్యార్థి చలో విద్యార్థి మహా గర్జన జయప్రదం చేయండి

### ఎస్ఎఫ్ఐ నేతలు



**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 26:–** ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థి మహాగర్జన పోస్టర్లు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. 9 నెలలవుతున్న రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం వలన విద్యారంగంలో అనేక సమస్యలు పేరుకు పోతున్నాయన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి నియమించాలని, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు దాదాపుగా రాష్ట్రవ్యాప్తంగా రూ.8,225 కోట్ల రూపాయలు పెండింగ్ లో ఉన్నాయి, బకాయిలు విడుదల చేయకపోవడం వలన విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు, అదేవిధంగా అదే భవనాల్లో ఉన్న గురుకులాలు సంక్షేమ హాస్టల్ విద్యార్థులు అరకొర వసతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనంలో ఉన్న గురుకులాలు సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, పెరిన ధరలకు అనుగుణంగా కాస్మోటింగ్ చార్జీలు పెంచాలని, యూనివర్సిటీలకు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ నియమించాలని కోరుతూ ఈనెల 27న విద్యార్థి మహాగర్జన ఇందిరా పార్క్ వద్ద ఉంటుందని విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సైదానాయక్ లక్ష్మణ్, వెంకటేష్, రమేష్, జగన్, వీరన్న, నితిన్, ప్రీతం, పవన్, సోహను, రిషి, సాయి కృష్ణ, మోహన్, ధనుష్, సాయి మనోహర్, సాయి నితిన్ పాల్గొన్నారు.

# యువత మత్తుకు దూరంగా ఉండి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### ఇన్స్పెక్టర్ కరుణాకర్



**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 26:–** మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు యువకులు దూరంగా ఉండాలనీ ఒన్ టౌన్ పోలీస్ ఇన్స్పెక్టర్ కోట కరుణాకర్ కోరారు. మిషన్ పరివర్తన్ కింద టీఎస్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గంజాయి సేవించిన, విక్రయించిన వారి సమాచారం తెలిస్తే పోలీసులకు అందించి నివారణకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ర్యాగింగ్ కు కఠిన చర్యలు, శిక్షలున్నాయని ఆయన తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలనీ కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాలేరు నీటి విడుదల

**నడిగూడెం, –నవభూమి:** సాగర్ ఎడమ కాల్వలో బుధవారం రాత్రి పాలేరు వరకు సాగునీరు విడుదల చేశారు. ఎడమ కాల్వకు రెండు చోట్ల గండ్లు పడటంతో కాల్వలకు సాగునీటి విడుదలను నిలుపుదల చేశారు. అనంతరం ఎడమ కాల్వ పరిధిలో 128 కి.మీ. వద్ద క్రాస్ బండ్ ఏర్పాటు చేసి అక్కడివరకు సాగునీరు విడుదల చేశారు. గండి పరిసర ప్రాంతంలో సాగులో ఉన్న పంట పొలాలు ఎండుతున్నాయని మంత్రి ఉత్తమ్ పర్యటనలో రైతులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఎడమ కాల్వకు పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించడంతో క్రాస్ బండ్‌ను అధికారులు పొక్లెయిన్‌తో బుధవారం రాత్రి తొలగించారు.

# చిన్నారి పెళ్లికూతురికి కౌన్సిలింగ్



**భువనగిరి –నవభూమి:** ఆడుతూ.. పాడుతూ హాయిగా చదువుకోవాల్సిన బాల్యాన్ని పసుపుతాడుతో బందీ చేస్తున్నారు. కుటుంబ పెద్దలే భవిష్యత్తును చిదిమేస్తున్నారు. మైనార్టీ తీరని పిల్లలకు మూడుముళ్లు వేయించేందుకు సిద్ధమవుతున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారు అవగాహన రాహిత్యంతో తమ పిల్లలకు పెళ్లి చేసి భారాన్ని దింపుకొనేందుకు బాల్య వివాహాలు చేస్తున్నారు. బలవంతంగా.. ఆడ సంతానం ఎక్కువగా ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాల వారు బాల్య వివాహాల వైపు మొగ్గు చూపుతున్నారు. తెలిసిన సంబంధమని మరికొంతమంది ముందడుగేస్తున్నారు. పిల్లలు వివాహాలు వ్యతిరేకించినా వారిపై ఒత్తిడి చేసి ఫిర్యాదులు చేయకుండా చేస్తున్నారు. కొంతమంది మైనర్లు భయపడకుండా అధికారులకు సమాచారం ఇస్తున్నారు. గిరిజన తండాలు, మూరుమూల పల్లెలో గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్నారు. అధికారులకు సమాచారం అందడంతో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, చట్టం గురించి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. 16, 17 ఏళ్లలోపు బాలికలు ఇంటర్మీయట్, డిగ్రీ చదువుతూ సామాజిక మాధ్యమాల్లో పరిచయమయ్యే వ్యక్తులకు బాగా ఆకర్షితులవుతున్నారు. ప్రేమ పేరుతో ఇంట్లో తెలియకుండా పెళ్లి చేసుకునే వరకు వెళ్తున్నారు. తెలిసీ తెలియని వయసులోనే పరిచయమైన వ్యక్తులను గుడ్డిగా నమ్ముతున్నారు. ఎలాంటి భయాందోళనలు లేకుండా బాల్య వివాహాలపై టోల్‌ఫ్రీ నెంబర్ 1098, 100 సమాచారం ఇవ్వవొచ్చు. ఇటీవల ఘటనలు ఇలా.. మోటకొండూరు మండలం తేరాల గ్రామంలో 16 ఏళ్ల బాలికకు వివాహం చేసేందుకు ఆగస్టు 16న ఏర్పాట్లు చేస్తుండగా బాలల పరిరక్షణ అధికారులు అడ్డుకున్నారు. బాలిక తల్లిదండ్రులది జనగాం జిల్లా బచ్చన్నపేట. గతంలో అక్కడ వివాహం చేసేందుకు ప్రయత్నం చేయగా అధికారులు అడ్డుకున్నారు. మరోసారి అధికారులకు తెలియకుండా మేనమామ ఊరు తేరాలలో పెళ్లి చేస్తుండగా అధికారులకు సమాచారం వచ్చింది. వివాహం నిలిపివేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. వలిగొండ మండలం వేములకొండలో 16 ఏళ్ల బాలికలకు వివాహం చేస్తుండగా అధికారులు నిలిపివేశారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం ఎదులాబాద్‌కు చెందిన బాలికను జనగాం జిల్లాకు చెందిన 30 ఏళ్ల వ్యక్తితో వివాహం చేసేందుకు చూశారు. చట్టం ఏం చెబుతోంది బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండకుండా వివాహం చేస్తే అది బాల్యం వివాహం అవుతుంది. బాల్య వివాహాలు జరిపించిన కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, ప్రోత్సహించినవారు, పెళ్లికి హాజరైన వారు సైతం బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం శిక్షార్హులు అవుతారు. దేవాలయాల్లో పెళ్లిళ్లు జరిపించే పురోహితులు, పెద్దలుగా ఉండేవారిపై కేసులు నమోదు చేస్తారు. ఈ చట్టం కింద కేసులు నమోదైన వారికి న్యాయస్థానాల్లో రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించే అవ కాశం ఉంటుంది.

# సర్వేతో సర్వత్రా ఆనందం

**తిరుమలగిరి –నవభూమి:** స్వాతంత్ర్యం నాటి నుంచి సాగు చేసుకుంటున్న భూములు.. ఎన్నో ప్రభుత్వాలు మారాయి.. కానీ గిరిజనులకు మాత్రం కష్టాలు తగ్గలేదు. భూమి ఉందనే తప్పా వాటికంటూ ఎలాంటి పట్టాలు లేవు.. సంక్షేమ పథకాలు అందవు. దీని పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల భూసంబంధిత సమస్యల కోసం పైలట్ ప్రాజెక్ట్ మండలకేంద్రంగా తిరుమలగిరి సాగర్‌ను ఎంపిక చేసింది. దీంతో ప్రభుత్వ, అటవీశాఖ, కాందిశీకుల భూములను ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు ఊరట కలిగింది. అందులో కాందిశీకుల భూములు, అటవీశాఖ భూములు కేంద్ర పరిధిలో, ప్రభుత్వ, బంచరాయి భూములు రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004లో ఈపీ ల్యాండ్ కోసం ప్రత్యేక జీవో జారీ చేసింది. ప్రభుత్వ భూములకు ఆసైన్డ్ కమిటీ ఏర్పాటు చేసి ఎంజాయిమెంట్ సర్వే చేసి రాష్ట్రంలోని కాందిశీకుల భూములను సాగు చేసుకుంటున్న కొంతమంది రైతులకు వివిధ మండలాల్లో పట్టా పాసుపుస్తకాలను అందజేసింది. తిరుమలగిరి సాగర్ మండలంలో కూడా కొంత మంది రైతులకు మాత్రమే ప్రభుత్వం పట్టాలను అందజేసింది. ధరణి రావడంతో ఆ రైతుల పేర్లు కూడా ఆన్‌లైన్‌లో మాయమయ్యాయి. దీంతో అప్పటి నుంచి చింతలపాలెం, నాయకునితండా, తిమ్మాయిపాలెం శివారు ప్రాంతంలోని కాందిశీకుల భూములు సాగు చేసుకుంటున్న రైతులకు సంక్షేమ పథకాలు అందక పెట్టుబడి సాయానికి అప్పులు చేసి తిప్పలు పడుతున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న గిరిజనులకు పంట రుణాలు, రైతుబీమా, భరోసా అందక పెట్టుబడికి ఏటా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వాలు భూమి హక్కు పత్రాలు ఇచ్చిన పాసుపుస్తకాలు జారీచేయకపోవడంతో ఆన్‌లైన్‌లో వీరి పేర్లు నమోదు కాలేదు. దీంతో ఏళ్లుగా వీరికి రుణాలు రావడం లేదు. కాందిశీకుల భూములకు పట్టా పాసుపుస్తకాలు.. మండలంలో కాందిశీకుల భూములను చింతలపాలెం, నాయకునితండా, తిమ్మాయిపాలెం గ్రామాలలో రైతులు సాగు చేసుకుంటున్నారు. రెవెన్యూ బృందాలు చింతలపాలెం రెవెన్యూ గ్రామ శివారు ప్రాంతాల్లో 28 సర్వే నంబరులో 766.27 ఎకరాలు, 52లో 761.31 ఎకరాలు, 60లో 660.20 ఎకరాలు, 16లో 8.04 ఎకరాలు, 70లో 4.04 ఎకరాలు, 204లో 13.03 ఎకరాలు, తిమ్మాయిపాలెం రెవెన్యూ గ్రామ శివారులో 24 సర్వే నంబరులో 105.15 ఎకరాలు, 38లో నంబరులో 550.16 ఎకరాల భూములకు ఎంజాయిమెంట్ సర్వే కొనసాగిస్తున్నారు. సర్వే పూర్తి చేసి తమ వివరాలను ఆన్‌లైన్ నమోదు చేస్తే పట్టాపాసుపుస్తకాలు ఉంటాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అప్పుల బాధలు తప్పుతాయి.. మునినాయక్, నాయకునితండా ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న ఆన్‌లైన్‌లో పేర్లు లేకపోవడంతో భూమి ఉందని చెప్పలేకపోతున్నాం. ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలకు అర్హులం కాలేకపోయాం. కాందిశీకుల భూములకు సర్వే చేసి పట్టా పాసుపుస్తకాలు అందజేస్తే సంక్షేమ పథకాలు అంది అప్పుల బాధలు తప్పుతాయి. సాగులో ఉన్న రైతులకు పట్టాపాసుపుస్తకాలు అనిల్‌కుమార్, తహసీల్దారు, తిరుమలగిరి సాగర్ మండలం ప్రభుత్వం భూమి సంబంధిత సమస్యల పరిష్కారానికి చేస్తున్న సర్వేలో భూమి సాగు చేస్తున్న రైతులందరికీ పట్టా పాసుపుస్తకాలు అందజేస్తాం. అర్హులైన రైతుల కాందిశీకుల భూములకు అప్పట్లో కాస్ట్‌ఆఫ్ పేమెంట్ కింద ఉన్న భూములకు పట్టా పాసుపుస్తకాలు, పేమెంట్ చేయని రైతులకు ప్రభుత్వ భూముల కింద పాసుపుస్తకాలను ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం.



## వీర నారి ఐలమ్మకు నివాళులు అర్పించిన ఎమ్మెల్యేలు బిఎల్ఆర్, వీరేశం, డిసిసి చీఫ్ శంకర్





**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 26:-** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్యే వేముల వీరేశం,డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ తో కలిసి గురువారం హనుమాన్ పేటలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని దొరలు, దేశ్‌ముఖ్‌లు, రజాకార్లను గడగడలాడించిన ఐలమ్మ స్ఫూర్తితో ప్రజాపోరాటాలను కొనసాగించాలన్నారు నిజాం హైదరాబాద్ సంస్థానంలో రజాకార్లు, దొరలు, జాగిరిదార్లు, పేదలు, బడుగు, బలహీనవర్గాలపై దాడులు చేస్తూ క్రూరంగా ప్రవర్తించి ప్రజలను గోసపెట్టారని ఈ పరిస్థితులలో విసునూరి రామచంద్రారెడ్డి ఆగడాలను, దౌర్జన్యాలను ఎదురించిన వీరనారి కమ్యూనిస్టు ఐలమ్మ సాయుధ పోరాటాన్ని నడిపించిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి వీర వనిత చాకలి ఐలమ్మ పేరు పెట్టడం జరిగిందని అదే విధంగా చాకలి ఐలమ్మ మనవరాలు శ్వేతను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించి గౌరవించడం జరిగిందన్నారు.చాకలి ఐలమ్మ స్ఫూర్తి తో మా ప్రజాపాలన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, టీ. అర్జున్, కౌన్సిలర్లు ఎం. నర్సిరెడ్డి, దేశిడి శేఖర్ రెడ్డి, గంధం రామకృష్ణ, బాశాని గిరి, కాంగ్రెస్ నాయకులు ఉబ్బపల్లి కాశయ్య, మహేష్ గౌడ్, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం 8, 9 వార్డుల్లో ప్రారంభం

**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 26:-** మిర్యాలగూడ పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో గురువారం 8వ, 9 వార్డులో ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాధినేని శ్రీనివాస్, బంటు సైదులు, రేపాల పురుషోత్తంరెడ్డి, సీతారాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు టీ హనుమంతరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి దాశరాజు శివ, పెద్దపోయిన వెంకటరమణ, యువ మోర్చా పట్టణ అధ్యక్షులు శంకర్, అజయ్, లక్ష్మారెడ్డి, సభ్యత నమోదు ప్రముఖు కంచు కొమ్ముల వేణు,అయిల శ్రీనివాసు గౌడ్, సాయి సుంకరి, రామకృష్ణ, రమేష్ గౌడ్ అక్కి, రమేష్ గౌడ్ చిత్రియాల, నాగరాజు గౌడ్, విజయ్, యాదగిరి, కిరణ్, అజయ్ చిత్రియల, పాల్గొన్నారు



# భరోసాతో..దసరా పండగేనా

**అడవిదేవులపల్లి, -నవభూమి:** తమ ప్రభుత్వ హయాంలో భారాస రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో పంట సాయం కోసం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రైతు భరోసాగా మార్పు చేసింది. ఈ పథకం కింద ఆర్థిక సాయం జులైలోనే అందించాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల తాత్సారం చేస్తూ వచ్చింది. ఆగస్టు 15 నుంచి రుణమాఫీ మూడు విడతలుగా చేసినా.. ఇంకా చాలా మంది రైతులకు సొమ్ము అందలేదు. మాఫీ అయిన వారికి సైతం చాలా వరకు ఇంకా బ్యాంకుల చుట్టూ తిరిగినా రుణాలు ఇవ్వలేదని రైతులు చెబుతున్నారు. ఈ క్రమంలో అక్టోబరులో రైతుభరోసా ఇవ్వనున్నామని ప్రభుత్వ పెద్దలు అంటుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ పంట కాలం మరో 15 రోజుల్లో ముగియనుంది. పంట మొదట్లో ఇవ్వాల్సిన ఆర్థిక సాయం కనీసం చివర్లోనైనా ఇస్తే బాగుండని ఉమ్మడి జిల్లాలోని 23.73 లక్షల మంది రైతుల ఎదురుచూస్తున్నారు. పెరుగుతుందన్న ఆశ అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15వేల రైతుభరోసా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఎన్నికల సమయంలో గత ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడానికి నిధులు సిద్ధం చేయగా ఎన్నికల సంఘం నిలిపివేసింది. ఇక అప్పటి నుంచి రైతు భరోసా రైతులకు అందలేదు. తాజా ప్రభుత్వం దసరాకు భరోసా ఇస్తామంటోంది. ప్రస్తుతం మరో నెల రోజుల్లో రబీ సీజన్ కూడా మొదలవుతోంది. రెండు పంటలవి కలిపి ఎకరాకు రూ.15వేలు జమ చేస్తుందా లేక ఖరీఫ్‌వి మాత్రమే జమ చేస్తుందా అన్నదానిపై స్పష్టత లేదు. మార్గదర్శకాలపై ఆందోళన ఇక ప్రభుత్వం రైతు భరోసా నిధుల జమకు సంబంధించిన మార్గదర్శకాలు ఏ విధంగా ఉండబోతున్నాయనే దానిపై రైతులు ఆందోళనలో ఉన్నారు. ముఖ్యంగా సన్నకారు రైతులకు ఎలాంటి ఢోకా లేకున్నా పెద్దకారు రైతుల్లో మాత్రం ఆందోళన ఉంది. కటాఫ్ ఎన్ని ఎకరాలు ఉండబోతుందో అన్న సందేహాలున్నాయి. ప్రభుత్వం పదెకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే ఇస్తే మిగతా వారికి రైతు భరోసా దూరం కానుంది. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారికి కూడా రైతు భరోపా కోత పెట్టాలన్న యోచనతో ప్రభుత్వం ఉందని రైతులు భావిస్తున్నారు. ఇలాంటి వాటన్నిటికీ నెలాఖరులోపు స్పష్టత వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



# బస్సు కావాలి

**మిర్యాలగూడ -నవభూమి:** మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ మార్గంలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎక్స్‌ప్రెస్ బస్సులు లేవు. దీంతో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నల్గొండ నుంచి హైదరాబాద్‌కు సైతం ఎక్స్‌ప్రెస్ బస్సులు తక్కువగా ఉండడంతో.. కోదాడ నుంచి వచ్చే బస్సుల కోసం మహిళలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. మునుగోడు నియోజకవర్గానికి ఆర్టీసీ బస్సు రవాణాను పెంచేందుకు 21 మార్గాల్లో బస్సులు నడపాలని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించిన నాటి నుంచి ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఉమ్మడి జిల్లాలో 60 శాతం ఉన్న ఓఆర్.. ప్రస్తుతం 100పైగా పెరిగింది. పండగలు, సెలవు దినాల్లో 120కి పైగా ఓఆర్ నమోదవుతుంది. ఈ నేపథ్యంలో కరోనా అనంతరం రద్దయిన అనేక మార్గాలతో పాటు పలు కొత్త మార్గాలకు సైతం బస్సులు నడపాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాటితోనే.. ప్రధాన మార్గాలకు బస్సులు నడుపుతుండగా.. ఆయా మార్గాల్లోనే సర్వీసుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. అదనంగా అవసరం..పాత మార్గాల పునరుద్ధరణ, కొత్త మార్గాలు, ప్రస్తుత మార్గాల్లో అదనపు సర్వీసుల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 200కు పైగా బస్సులు అవసరం పడనున్నాయి. వీటిలో మిర్యాలగూడ డిపోకు సుమారుగా 35, దేవరకొండకు 25, కోదాడకు 25, నల్గొండకు 30, సూర్యాపేటకు 35, యాదగిరిగుట్టకు 25, నార్కట్‌పల్లి డిపోకు 30 బస్సులు అదనంగా కావాలని స్థానిక నాయకులు, ప్రయాణికులు కోరుతున్నారు. పాతవి మార్చాలి.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల 79 కొత్త బస్సులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న బస్సుల్లో 43 బస్సులను మార్చాల్సిన అవసరం ఉంది. నిబంధనల ప్రకారం 12 లక్షల కిలో మీటర్లు తిరిగిన, 15 ఏళ్లు దాటిన బస్సులను తుక్కుగా మార్చాల్సిన అవసరం ఉంది. బస్సుల లేమి కారణంగా తీసేయాల్సిన బస్సులను సైతం నడిపిస్తున్న పరిస్థితి నెలకొంది. నల్గొండ డిపోకు ఇటీవలే కొత్త రాజధాని బస్సు రాగా.. మిర్యాలగూడ డిపోలో ఉన్న పాత రాజధాని బస్సు తరచూ మొరాయిస్తుంది. ఇటువంటి బస్సుల వల్ల నిర్వహణ ఖర్చు అధికమవుతుందని మెకానిక్‌లు చెబుతున్నారు. వీటి స్థానంలో కొత్త బస్సులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కొత్త బస్సులతో పాటు డ్రైవర్ల కోసం ప్రతిపాదనలు.. రాజశేఖర్, ఆర్ఎం, నల్గొండ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరో 40 నూతన బస్సులకు ప్రతిపాదనలు పంపించాం. వీటితోపాటు 200 మంది డ్రైవర్ల నియామకానికి సైతం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. పాత మార్గాల నుంచి వినతులు వస్తున్నందున ఆదాయాన్ని బట్టి ఆయా మార్గాల్లో బస్సులు నడిపే అంశాన్ని సైతం పరిశీలించనున్నాం.



# కిశోర బాలికలు సరైన పోషకాహారం తీసుకోవాలి

**పిఓ మమత**





**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 26:–** కిషోర బాలికలు సరైన పోషకాహారం తీసుకోవాలని ఐసీడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ ఆర్.మమత కోరారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని చిల్లాపురం సెక్టార్ శ్రీనివాసనగర్మోడల్ స్కూల్, దుబ్బతండ గురుకుల పాఠశాలలో గురువారం కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మమత మాట్లాడుతూ కిశోర బాలికల ఆరోగ్యం గురించి వారు సరైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వివిధ రకాల పోషకాలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలు,ప్ చిరుధాన్యాలు తీసుకోవాలని, సమతుల ఆహారం ప్రాధాన్యత ను పాటించాలని వివరించారు. అదేవిధంగా రక్తహీనత వలన కలిగే నష్టాల గురించి వివరించి, బాలికలు భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. అదేవిధంగా బాల్యవివాహాల, చదువు ప్రాముఖ్యత గురించి మాట్లాడడారు.కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ఆర్.వాణి, అంగన్వాడీ టీచర్స్ భవాని, సక్కు, పద్మ, వైద్యారోగ్య శాఖ రెహానా, జయరాణి, రూప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఐలమ్మకు నివాళులర్పించిన బిజెపి నాయకులు

**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 26:–**మిర్యాలగూడ పట్టణ శాఖ అధ్వర్యంలో సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం ఆమె విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళు లర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ఆశయాలను సాధిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాతినేని శ్రీనివాస్, బంటు సైదులు, రేపాల పురుషోత్తంరెడ్డి, సీతారాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు టీ.హనుమంత్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి దాశరాజు శివ, పెద్దపోయిన వెంకటరమణ, యువ మోర్చా పట్టణ అధ్యక్షులు శంకర్, అజయ్, లక్ష్మారెడ్డి, సభ్యత నమోదు ప్రముక్ కంచుకొమ్ముల వేణు, పొరెడ్డి శ్రీను, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



# కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి అడుగంటింది



**యాదగిరిగుట్ట, –నవభూమి:** యాదాద్రి క్షేత్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి మల్లారెడ్డి దంపతులకు ఆశీస్సులు అందజేస్తున్న వేదపండితులు రెవెన్యూ, నీటిపారుదల, పురపాలక శాఖలు ఉన్నాక హైడ్రా ఎందుకు, ఇదంతా ప్రజల ఆలోచన పక్కదారి పట్టించేందుకేనని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విమర్శించారు.యాదాద్రి క్షేత్రాన్ని మల్లారెడ్డి సతీ సమేతంగా బుధవారం సందర్శించారు. దైవ దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మార్కింగ్ చేసి నోటీస్ ఇవ్వండి.ఆ తర్వాత తొలగించండి. ప్రజా జీవితాలను గందరగోళంలో పడేయకండని ఆయన సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో అన్ని రంగాలలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అడుగంటిపోయింది, హామీలు అమలు చేసే సామర్థ్యం, చిత్తశుద్ధి ఈ పాలకులకు లేదని ప్రజలు గ్రహించారన్నారు. దైవారాధనలో పాల్గొన్న మాజీ మంత్రి దంపతులు పండితులతో ఆశీస్సులు పొందారు. ఆలయ అధికారులు దేవుడి ప్రసాదం అందజేశారు.

# ఆదుకునే.. ఆధునిక మోకు

**భువనగిరి –నవభూమి:** రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల ఆరాధ్య దైవం కాటమరాజు పేరుతో భద్రత కోసం సేఫ్టీ మోకులను ప్రవేశపెట్టింది.కల్లు గీసే క్రమంలో పలుమార్లు గీత కార్మికులు చెట్టుపై నుంచి కందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. పని భద్రత కల్పించడానికి నిపుణులతో రూపొందించిన కిట్లను వెనకబడిన తరగతుల (బీసీ) కార్పొరేషన్ ద్వారా విడతల వారీగా పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేపట్టింది. గౌడ వృతిదారులకు "కాటమయ్య రక్షక కవచం" వెన్నుదన్నుగా నిలవనుంది.యాదాద్రి భువనగిరి జిల్లాలో 345 గీత కార్మికుల సొసైటీలు, 19,665 వేల మంది గీత కార్మికులు ఉన్నారు. జిల్లాకు 400 సేఫ్టీ మోకులు మంజూరయ్యాయి. వీటిని పంపిణీ చేసేందుకు ఇప్పటికే 125 మందికి శిక్షణ పూర్తి చేశారు. మరో 275 మందికి శిక్షణ పూర్తయిన తర్వాత పంపిణీ చేయనున్నారు.భువనగిరి మండలం నందనం, యాదగిరిగుట్ట, ఆలేరు మండలం కొలనుపాకలో సేఫ్టీమోకులపై ఇద్దరు నిపుణులు గీత కార్మికులకు అవగాహన కల్పిస్తున్నారు.రక్షక కిట్లో గీత కార్మికులు చెట్లు ఎక్కినప్పుడు కింద పడకుండా, మోకు జారకుండా ఉండేందుకు దృఢమైన బెల్ట్తాడు, మరో మూడు క్లిప్పులు ఉన్నాయి. గతంలో మోకు జారితే కింద పడేవారు. కిట్టు ధరిస్తే తాడు కింద పడకుండా నిలువరిస్తుంది. దీంతో ప్రాణాపాయం తప్పుతుందని నిపుణులు చెబుతున్నారు.సేఫ్టీ మోకులతో రక్షణ: పి.సైదులు, సూపరింటెండెంట్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ తాటి చెట్లు ఎక్కే సమయంలో జరిగే ప్రమాదాల నివారణకు గీత వృత్తిదారులకు సేఫ్టీ మోకులు ధరించడం వల్ల రక్షణ ఉంటుంది. చెట్టు మీద నుంచి అకస్మాత్తుగా జారినా తీవ్రమైన ప్రమాదం జరగకుండా ఉంటుంది. ప్రభుత్వం అందించే పరికరాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి గీత కార్మికుడికి ఆధునిక మోకులపై శిక్షణ ఇచ్చి విడతల వారీగా పంపిణీ చేస్తాం.



# నిధులు నిలిచి.. పనులు పడకేసి..!



**సూర్యాపేట –నవభూమి:** పురపాలికలకు పట్టణ ప్రగతి నిధులు విడుదల కావడం లేదు.దీంతో పురపాలికలు పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇబ్బందులు పడుతున్నాయి. రహదారులు, మురుగు కాల్వలు, ఇతర పనులు చేపట్టలేక పుర అధికారులు చేతులెత్తేశారు. ప్రతి నెల పురపాలికలకు రూ.లక్షల నిధులు విడుదల కావాల్సి ఉండగా.. గతేడాది జూన్ నుంచి రావడం లేదు. పలుమార్లు పుర అధికారులు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది.ఇదీ పరిస్థితి సూర్యాపేట జిల్లాలో ఐదు పురపాలికలు ఉన్నాయి. సూర్యాపేట పురపాలికకు గతేడాది జూన్ నుంచి ప్రతి నెలా రూ.46.50 లక్షల నిధులు రావడం లేదు. 14 నెలల నుంచి మొత్తం రూ.6,51,00,000 పట్టణ ప్రగతి నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులు చేసేందుకు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.కోదాడ పురపాలికకు కూడా గతేడాది జూన్ నుంచి పట్టణ ప్రగతి నిధులు రావటం లేదు. ప్రతి నెలా రూ.6,60,000 నిధులు రావాల్సి ఉంది.హుజూర్నగర్ పురపాలికకు గతేడాది డిసెంబరు నుంచి ప్రతి నెలా రూ.17 లక్షల నిధులు రావాల్సి ఉంది. కానీ నేటికీ ఒక్క పైసా రాలేదు.నేరేడుచర్ల పురపాలికకు 2023 ఆగస్టు నుంచి ప్రతి నెలా రూ.6,01,796 నిధులు రావాల్సి ఉంది. 13 నెలలుగా మొత్తం రూ.78,23,348 లక్షల నిధులు పెండింగ్లో ఉన్నాయి.తిరుమలగిరి పురపాలికకు గతేడాది జూన్ నుంచి నిధులు రావటం లేదు. ప్రతి నెలా రూ.8.9 లక్షల నిధులు రావాల్సి ఉంది. 14 నెలలుగా మొత్తం నిధులు రూ.1,24,60,000 పెండింగ్లో ఉన్నాయి. ఉన్నతాధి కారులకు విన్నవించాం: శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట పురపాలికకు పట్టణప్రగతి నిధులు రావడం లేదు. గతేడాది జూన్ నుంచి నిధులు రాకపోవటంతో ఉన్నతాధికారులకు విన్నవించాం. నేటికీ ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. మరోసారి విన్నవించి విడుదల చేయాలని కోరుతాం.

# పంచాయతీ కార్యదర్శుల సామూహిక సెలవు

**నల్గొండ –నవభూమి:** జిల్లాలో ఇటీవల సస్పెండ్ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు బుధవారం సామూహిక సెలవు పెట్టారు.విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంగళవారం కలెక్టర్ గుర్రంపోడు ఎంపీడీవో, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. దీనికి నిరసనగా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవో, ఎంపీడీవోలు ఆందోళన బాట పట్టారు. అనంతరం అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)కు తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందచేశారు. జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వం నిధులు విడుదల చేయక ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ గ్రామాల్లో ప్రజలకు సేవ చేస్తున్నారని వినతి పత్రంలో వివరించారు.నెలవారి వేతనం నుంచి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి డబ్బులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తమ సమస్యలు పట్టించుకోకుండా పై అధికారులు అకారణంగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సామూహిక సెలవులు పెడుతున్నట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ పూర్ణచందర్ కార్యదర్శుల సంఘం ప్రతినిధులతో చర్చించారు.కలెక్టర్ పర్యటనలో ఉన్నందున వచ్చిన తర్వాత చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. అప్పటి వరకు సెలవులో వెల్లవద్దని సూచించారు. దీంతో సంఘం ప్రతినిధులు అంగీకారం తెలిపారు. గురువారం నుంచి యథావిధిగా విధులకు హాజరుకానున్నట్లు తెలిపారు.



# నీటిసంపులో పడి బాలుడి మృతి

మృతి చెందిన బాలుడు కరుణ్ కుమార్



**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి. సెప్టెంబర్ 26** పురపాలక కేంద్రంలోని రామ్ నగర్ కాలనీలో 13 నెలల బాలుడు తన సోదరుడితో కలిసి ఆడుకుంటుండగా నీటి సంపులో పడి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన పూర్ణియా జిల్లా లోని బర్వారాకోటి గ్రామానికి చెందిన అర్జున్ దాస్ గత సంవత్సరం క్రితం కూలి పని నిమిత్తం పోచంపల్లిలోని రామ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కాగా ఇతనికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది గురువారం అర్జున్ దాస్ పని నిమిత్తం వెళ్ళగా అతని భార్య గుడియాదేవి ఇంటి పని ముగించుకుని కొద్దిసేపు నిద్ర పోదామని నాలుగు గంటల సమయంలో నిద్ర పోగా కరణ్ కుమార్ తన సోదరులతో కలిసి ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న గా ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపు తెరిచి ఉండడంతో ఆడుకుంటూ అందులో పడిపోయాడు. కాగా అదే ఇంట్లో బీహార్ రాష్ట్రానికి చెందిన సంతోష్ దాస్ కిరాయికి ఉండగా తాను పని ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో కరణ్ కుమార్ సోదరుడు తన సోదరుడు నీటిలో పడిపోయాడని చెప్పక వెంటనే చూసేసరికి కరణ్ కుమార్ మునిగిపోయి ఉన్నాడు. సంతోష్ దాస్ కేకలు వేసి ఇరుగుపొరుగు వారిని లేపి అందులో దూకి బాలుడిని బయటకు తీయగా అప్పటికే కరణ్ కుమార్ మృతి చెంది ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి. కేస్ నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్ట్ మాస్ట నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# ప్రతి బ్యాంక్ సిబ్బంది చేనేత వస్త్రాలను ధరించాలి

## బ్యాంక్ సిబ్బంది కోసం చేనేత వస్త్రాలను అందిస్తున్న చైర్మన్ తడక రమేష్

**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి. సెప్టెంబర్ 26** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో గురువారం పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ అర్బన్ బ్యాంక్ పోచంపల్లి శాఖకు సంబంధించిన 30 మంది సిబ్బంది యూనిఫామ్ కోసం పది వేల రూపాయల విలువగల చేనేత వస్త్రాలను బ్యాంక్ సీఈవో సీత శ్రీనివాస్, మేనేజర్ రచ్చ శ్రీనివాస్ కు ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు కానీ ప్రైవేట్ సెక్టార్ లో పనిచేస్తున్న ఉద్యోగులుగాని వారంలో ఏదో ఒక రోజు కచ్చితంగా చేనేత వస్త్రాలను ధరించాలని ఆయన కోరారు. అదే సంకల్పంతో అర్బన్ బ్యాంక్ ఉద్యోగులకు ప్రతి శనివారం చేనేత వస్త్రాలు ధరించాలని ఉద్దేశంతో వస్త్రాలను అందించామని ఆయన తెలిపారు. తద్వారా చేనేత కార్మికులకు ఉపాధి దొరకడంతో పాటు చేనేత పరిశ్రమ మనుగడలో దోహదం చేసిన వారవుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సీతా రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు ఏలే హరి శంకర్, సూరపల్లి రమేష్, రాపోలు వేణు, కొండమడుగు ఎల్ల స్వామి, మహిళా డైరెక్టర్లు గుండు కావ్య, కర్నాటి భార్గవి తదితరులు పాల్గొన్నారు.



# మిషన్ భగీరథ నీటి సరఫరా ఉద్యోగులకు శిక్షణ తరగతులు

శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ లలిత







**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి. సెప్టెంబర్ 26** మిషన్ భగీరథ నీటి సరఫరా కు సంబంధించి శిక్షణ తరగతులను సహాయకులు సద్వినియోగం చేసుకోవాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత కోరారు. పురపాలక కేంద్రంలో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ నీటి సరఫరా సంబంధించిన సహాయకులకు నాలుగు రోజులపాటు శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సహాయకులకు ప్లంబింగ్ అంశంపై ట్యాంకులు, పైప్ లైన్లు ,గేట్ వాల్, వాటి నిర్వహణ మరమ్మత్తులపై శిక్షణను అందించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై శిక్షణ తరగతులను పరిశీలించి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సహాయకులకు నాలుగు రోజుల పాటు శిక్షణను అందిస్తున్నామని ఆమె తెలిపారు. దీని ద్వారా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు అయిన వెంటనే వాటిని సరిచేసి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉండాలని ఉద్దేశంతో ఈ శిక్షణను అందిస్తున్నామని ఆమె అన్నారు .ఈ కార్యక్రమంలో వీరితోపాటు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరుణాకర్, గ్రేడ్ ఏఈ లక్ష్మీనారాయణ, డి ,ఈ,ఈ, దీన్ దయాల్, ఏ. ఈ. ఈ. సాయినాథ్ రెడ్డి, శ్వేత, మిషన్ భగీరథ హెల్పర్స్ మారాటి నరసింహ, మంచాల నరసింహ, ఎస్ కె షరీఫ్, రాములు తదితరులు ఉన్నారు.

# ఆ కార్యాలయాలు మళ్లీ వచ్చేస్తున్నాయ్!

**మిర్యాలగూడ, –నవభూమి:** ప్రాథమిక, మాధ్యమిక విద్యలను మరింత బలోపేతం చేసేందుకు, పాఠశాలల నిర్వహణపై పర్యవేక్షణ పెంచేందుకు ప్రభుత్వం జిల్లా ఉప విద్యాధికారి కార్యాలయాలను తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుంది. 2014లో తెలంగాణ ఏర్పాటైన తరువాత అప్పటి ప్రభుత్వం 2015లో జిల్లా ఉప విద్యాధికారి కార్యాలయాలను ఎత్తివేసింది. మండల విద్యాధికారులే ఒకటి నుంచి పది తరగతుల వరకు పాఠశాలలను పర్యవేక్షించే ఏర్పాటు చేశారు. తెలంగాణలో 10 జిల్లాలను 33 జిల్లాలకు పెంచటంతో అదనంగా జిల్లాలకు 21 మంది డీఈవోలు, 28 మంది డిప్యూటీ ఈవోలు, 59 మంది ఎంఈవోలు, ఐదుగురు ఏడీలు అవసరమని ప్రతిపాదించారు. దీనిలో భాగంగా ఎంఈవోలను అన్ని మండలాలకు రెండు రోజుల క్రితం కేటాయించగా జిల్లా ఉపవిద్యాధికారి కార్యాలయాలను సైతం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

# ఘనంగా వీరవనిత చాకలి ఐలమ్మ 129వ జయంతి

పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్







**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి. సెప్టెంబర్ 26** తొలి దశ తెలంగాణ ఉద్యమంలో భూమికోసం రజాకారులను ఎదిరించి పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. పురపాలక కేంద్రంలో గురువారం పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై పట్టణ రజక సంఘ అధ్యక్షుడు చేరాల చిన్న నరసింహతో కలిసి చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో వీరవనితగా నిలిచిన దీరురాలని ఆమె పోరాటం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్పర్సన్ బాత్కాలింగస్వామి,కౌన్సిలర్ దేవరాయ కుమార్,గౌరవ అధ్యక్షులు చేరాల లింగయ్య, ఇబ్రహీంపట్నం రమేష్, గౌరవ సలహాదారులు చేరాల బుచ్చయ్య, గౌరుకంటి నరసింహ,ఉపాధ్యక్షుడు సైదుగాని లక్ష్మీనారాయణ,ప్రధాన కార్యదర్శి చేరాల లింగస్వామి, ఆదర్శ కళానిలయం అధ్యక్షులు చేరాల ప్రకాష్, రజక సంఘం సహ కార్యదర్శి రామ చర్ల సందయ్య,కోశాధికారి గోరుకంటి బాలయ్య,డైరెక్టర్లు బండిరాల మల్లయ్య,చేరాల అశోక్,నలగంటి చిన్న మల్లేష్,చేరాల నవీన్,నలగంటి ప్రకాష్,ఇబ్రహీంపట్నం శేఖర్,రామ చర్ల పాండు,గోరుకంటి నవీన్,చేరాల విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.